క్లుప్తంగా

పేదింటి బిడ్డ వివాహానికి చేయూత



పుస్తె,మట్టెలు అందిస్తున్న దాతలు

కడెం: పేదింటి యువతి వివాహానికి పుస్తె, మట్టెలు అందించి పలువురు పెద్దమనసు చాటుకున్నారు. మండలంలోని ఉడుంపూర్ పంచాయతీ పరిధిలోని గండిగోపాల్‌పూర్ గ్రామానికి చెందిన చంద్రశేఖర్–దేవక్క దంపతుల కూతురు సుమలత వివాహం ఆదివారం జరుగగా.. ఉడుంపూర్ మాజీ సర్పంచ్ జొన్నల సావిత్రి–రాజయ్యగుప్తా దంపతులు, కాంగ్రెస్ నాయకుడు జొన్నల చంద్రశేఖర్ గుప్త పుస్తె, మట్టెలు, చీర, గాజులు అందించారు. అనంతరం వధువరూలను ఆశీర్వదించారు. దొంతుల శ్రీనివాస్, లింగన్నయాదవ్, కొట్టె రాజన్న, నర్సింహశాస్త్రి, గ్రామపెద్దలు తదితరులు ఉన్నారు.

చలివేంద్రం ప్రారంభం



చలివేంద్రం ప్రారంభిస్తున్న రితీశ్ రాథోడ్

ఖానాపూర్: మండలంలోని బీర్నంది గ్రామానికి చెందిన బీజేపీ నాయకుడు ఎనగందుల రవి ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని ఆదివారం బీజేపీ జిల్లా అధ్యక్షుడు రితీశ్ రాథోడ్ ప్రారంభించారు. వేసవిలో ప్రజల దాహార్తి తీర్చేందుకు చలివేంద్రం ఏర్పాటు చేయడం అభినందనీయమని పేర్కొన్నారు. కార్యక్రమంలో గడ్డం రవీందర్, గ్రామస్తులు ఉన్నారు.

నూతన కార్యవర్గం



అధ్యక్షుడిని సన్మానిస్తున్న ఉద్యోగులు

కుంటాల: మండలంలోని అందాకూర్‌లో ఆదివారం ప్రభుత్వ ఉద్యోగుల సంక్షేమసంఘం గ్రామ కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గ్రామ అధ్యక్షుడిగా సగ్గం గంగాధర్, గౌరవ అధ్యక్షుడిగా మహేశ్వర్ రావు, కార్యదర్శిగా గంగయ్య, కోశాధికారిగా బి.శంకర్, సభ్యులుగా దేవదాస్, భోజన్న, లక్ష్మణ్, అబ్దుల్ సజన్, ముఖేశ్ ఎన్నికయ్యారు.

విద్యాసామగ్రి పంపిణీ

బాసర: బాసర బీజేపీ పట్టణ అధ్యక్షుడు జిడ్డు సుభాష్ యాదవ్ తన అన్న కూతురు అమ్ములు పుట్టినరోజు సందర్భంగా ఆదివారం శ్రీ జ్ఞాన సరస్వతి అమ్మవారి ఆలయంలో పూజలు చేశారు. అనంతరం అమ్ములు చేతుల మీదుగా 100 మంది భక్తులకు నోట్‌బుక్‌లు, పెన్నులు, పలకలు పంపిణీ చేశారు.

పొట్టి శ్రీరాములు జయంతి



నివాళులర్పిస్తున్న నాయకులు

ఖానాపూర్: ఆంధ్రరాష్ట్ర ఏర్పాటుకు ఆమరణ నిరాహార దీక్ష చేసిన పొట్టి శ్రీరాములు జయంతిని ఆదివారం పట్టణంలోని వాసవి కన్యకా పరమేశ్వరి ఆలయంలో వాసవిక్లబ్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా పొట్టిశ్రీరాములు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. భాషాప్రయుక్త రాష్ట్రం కోసం వారు చేసిన పోరాటాలను గుర్తు చేసుకున్నారు. జితేందర్, రవీందర్, సతీశ్, రాజేందర్, సుధాకర్, ఆనంద్, అశోక్, లచ్చన్న తదితరులు ఉన్నారు.

అనుమతుల్లేకుండా ఇసుక తరలించొద్దు



పట్టుకున్న వాహనం వద్ద పోలీసులు

బాసర: అనుమతుల్లేకుండా ఇసుకను తరలిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ముధోల్ సీఐ మల్లేశ్ అన్నారు. పక్కా సమాచారం మేరకు ఆదివారం తెల్లవారుజామున కందకుర్తి నుంచి అక్రమంగా ఇసుక తరలిస్తున్న టిప్పర్‌ను మండలంలోని గోదావరి వంతెనపై చెక్‌పోస్టు వద్ద పట్టుకున్నట్లు పేర్కొన్నారు. బాసర ఎస్సై గణేశ్, సిబ్బంది టిప్పర్‌ను పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. కేసు నమోదు చేసి.. టిప్పర్‌ను రెవెన్యూ అధికారులకు అప్పగించనున్నట్లు ఎస్సై వివరించారు.

సారూ.. రోడ్డు బాగు చేయరూ..



లక్ష్మణచాంద: మండలంలోని మల్లాపూర్ నుంచి మునిపెల్లి గ్రామానికి వెళ్లే ప్రధాన రోడ్డు (ఒకటిన్నర కిలోమీటర్లు) పూర్తిగా ధ్వంసమైంది. రాత్రి ఈ రోడ్డుపై వెళ్లేందుకు అవస్థలు పడుతున్నామని.. అధికారులు స్పందించి రోడ్డును బాగుచేయాలని మునిపెల్లి వాసులు కోరుతున్నారు.

కోతి బొమ్మే కాపలా..

లక్ష్మణచాంద: ఆరుగాలం కష్టించి సాగు చేసిన పంటలను అడవి జంతువుల బారి నుంచి కాపాడుకునేందుకు రైతులు అవస్థలు పడుతున్నారు. లక్ష్మణచాంద మండలం మునిపెల్లికి చెందిన భూమేశ్ అనే రైతు భిన్నంగా ఆలోచించి తన వరి పొలంలో కోతి బొమ్మల ఫ్లెక్సీలను ఏర్పాటు చేశాడు. వీటిని చూసి జంతువులు పొలం వైపు రావడం లేదని రైతు అంటున్నాడు.



అదుపు తప్పితే.. ఒర్రెలోకే..



లక్ష్మణచాంద: మండలంలోని చామన్‌పెల్లి నుంచి మునిపెల్లి గ్రామానికి వచ్చే మార్గంలో ఒర్రెపై నిర్మించిన లోలెవల్ వంతెనపై ఇరువైపులా రక్షణ గోడ లేదు. దీంతో రాత్రి ఈ మార్గంలో రాకపోకలు సాగించేవారు అదుపుతప్పి ఒర్రెలో పడిపోయే ప్రమాదం ఉంది. అధికారులు వంతెనకు ఇరువైపుల రక్షణ గోడ నిర్మించాలని వాహనదారులు కోరుతున్నారు.

దోచుకెళ్తున్నారు.. జర భద్రం



- నడిరోడ్డుపైనే నగలు, డబ్బులు లాక్కెళ్తున్న వైనం
- పక్కా ప్లాన్‌తో వస్తున్న దుండగులు
- హడలెత్తిపోతున్న ప్రజలు
- పెట్రోలింగ్ పెంచామంటున్న పోలీసులు

జిల్లాలో దొంగలు రెచ్చిపోతున్నారు. పగలు, రాత్రి అనే తేడా లేకుండా ఒంటరి మహిళలు, తాళం వేసిన ఇళ్లను లక్ష్యంగా చేసుకొని దొంగతనాలకు పాల్పడుతున్నారు. ప్రధాన రోడ్లపైనే అందరూ చూస్తుండగానే మహిళల మెడలో నుంచి బంగారు గొలుసులు, వ్యక్తుల నుంచి డబ్బులను దర్జాగా లాక్కెళ్తున్నారు. బంగారం, డబ్బు, సెల్‌ఫోన్‌తోపాటు తదితర విలువైన వస్తువులతోపాటు వాహనాలను సైతం వదలడం లేదు. ఈ వరుస దొంగతనాలతో జిల్లా ప్రజలు భయాందోళన చెందుతున్నారు. పెట్రోలింగ్ పెంచి దొంగతనాల కట్టడికి పటిష్ట చర్యలు తీసుకోవాల ని పోలీసులను వేడుకుంటున్నారు. – నిర్మల్‌టౌన్

ఇటీవల జరిగిన ఘటనలు..

గతేదాది డిసెంబర్ నెలలో నిర్మల్‌లోని దివ్యనగర్‌లో జువెల్లరీ దుకాణం మూసేసి ఇంటికి వెళ్లిన యజమాని విశ్వనాథ్ తిరిగి మరసటి రోజు ఉదయం దుకాణం తెరిచేందుకు షాప్ వద్దకు రాగా ..షెట్టర్ తాళాలు పగులగొట్టి ఉన్నాయి. యజమాని లోపలికి వెళ్లి చూసేసరికి నాలుగు కిలోల వెండి, రెండు తులాల బంగారం చోరీ జరిగింది.

- గతేడాది డిసెంబర్ మాసంలో పట్టణంలోని పాతమార్కెట్‌లో గాల కరీం అనే కూరగాయల వ్యాపారి పెంచుకునే తన మూడు మేకలను గుర్తుతెలియని వ్యక్తులు దొంగలించారు.
- ఈ ఏడాది జనవరి 15న జిల్లా కేంద్రంలోని బుధవార్‌పేట్ కాలనీకి చెందిన నళిని తన కూతురితో కలిసి కాలనీలో నడుచుకుంటూ వెళ్తోంది. ఇద్దరు గుర్తుతెలియని వ్యక్తులు బైక్‌పై వచ్చి ఆమె మెడలో ఉన్న ఒకటిన్నర తులం (సుమారు రూ.1.50 లక్షల విలువైన) బంగారు గొలుసును లాక్కెళ్లారు.
- జనవరి 30న సినీ ఫక్కీలో రూ.5 లక్షల చోరీ జరిగింది. లక్ష్మణచాంద మండలం వడ్యాల్ గ్రామానికి చెందిన సిరిగే నరేశ్.. తన అల్లుడికి డబ్బులు అవసరం ఉండడంతో జిల్లాకేంద్రంలోని మయూరి హోటల్ వద్ద యూనియన్ బ్యాంకుకు వచ్చారు. బ్యాంకులో నుంచి డబ్బులు డ్రా చేసి బైకు సైడ్ బాక్సులో పెట్టారు. వారిని గమనిస్తున్న దుండగుడు నరేశ్ ఫోన్ మాట్లాడుతుండగా డబ్బులను ఎత్తుకెళ్లాడు.
- గత నెల 15న జిల్లా కేంద్రంలోని మంచిర్యాల చౌరస్తా ప్రాంతంలో జంగయ్య అనే వ్యక్తి రూ.50 వేలను కవర్‌లో పెట్టుకొని నడుచుకుంటూ వెళ్తుండగా గుర్తుతెలియని వ్యక్తి బైక్‌పై వచ్చి కవర్‌ను లాక్కొని వెళ్లిపోయాడు.

రద్దీ ప్రదేశాలే లక్ష్యం..

గతంలో వేసవికాలంలోనే దొంగతనాలు జరిగేవి. ప్రస్తుతం సీజన్, పగలు, రాత్రితో సంబంధం లేకుండా దొంగలు.. ప్రజలను హడలెత్తిస్తున్నారు. రద్దీ ప్రదేశాలైన మార్కెట్, బస్టాండ్‌తోపాటు తాళం వేసిన ఇళ్లు, ఒంటరి, వృద్ధ మహిళలను లక్ష్యంగా చేసుకొని దొంగతనాలను పాల్పడుతున్నారు. మొబైల్‌ఫోన్లు, బంగారు గొలుసులను ఎత్తుకెళ్తున్నారు. సీసీ కెమెరాల ఏర్పాటుతో ప్రయోజనాలను వివరిస్తున్నా.. కొందరు వాటిని ఏర్పాటు చేసుకోవడం లేదని పోలీసులు పేర్కొంటున్నారు.

పోలీసుల కళ్లు గప్పి..

సాంకేతికత అభివృద్ధి చెందిన ప్రస్తుత రోజుల్లో దొంగలు పోలీసుల చేతికి చిక్కకుండా తప్పించుకు తిరుగుతున్నారు. రాత్రి, పగలు వీధుల్లో గస్తీ కాస్తున్న పోలీసుల కళ్లు కప్పి దొంగతనాలకు పాల్పడుతున్నారు. పోలీసులకు ఎలాంటి ఆనవాళ్లు దొరకకుండా జాగ్రత్త పడుతున్నారు. ఇలా వరుస దొంగతనాలు చేస్తూ.. పోలీసులకు సవాళ్లు విసురుతున్నారు.

బంగారు గొలుసు దొంగతనాలు..

జిల్లాకేంద్రంలో పట్టపగలే దుండగులు బైక్‌ల మీద వచ్చి మహిళల మెడలోంచి బంగారు గొలుసులను ఎత్తుకెళ్తున్నారు. దీంతో ఒంటరిగా రోడ్డుపైకి వెళ్లాలంటేనే భయాందోళన చెందుతున్నారు.

దొంగ నోట్ల కలకలం..

జిల్లా కేంద్రంలో దొంగనోట్లు గత నెలలో కలకలం రేపాయి. గాంధీ మార్కెట్‌లో కూరగాయలు అమ్మే వృద్ధుడి వద్దకు వచ్చి ఓ వ్యక్తి వచ్చి రూ.200 దొంగ నోటు ఇచ్చి వెళ్లిపోయారు. సదరు నోటును గమనించిన మరో వ్యక్తి అది నకిలీదని గుర్తించాడు. మళ్లీ కొన్ని రోజులకు మంజులాపూర్ చౌరస్తాలో కూరగాయల వ్యాపారి వద్దకు వచ్చి నకిలీ నోటు ఇచ్చారు. వ్యాపారి గుర్తించి గొడవకు దిగి పెట్రోలింగ్ పోలీసులకు సమాచారం ఇచ్చి వివరాలు చెప్పాడు. పోలీసులు నకిలీ నోటు ఇచ్చిన వ్యక్తిని అదుపులోకి తీసుకొని తమదైన శైలిలో అడుగగా మహారాష్ట్ర నుంచి నకిలీ నోట్లు తెచ్చినట్లు ఒప్పుకున్నాడు. వారిపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

పక్క రాష్ట్రం నుంచి వస్తున్నారనే..

జిల్లాకు సరిహద్దు ప్రాంతమైన మహారాష్ట్రకు నిత్యం రాకపోకలు కొనసాగుతుంటాయి. అంతేకాక జిల్లాలో 44, 61వ జాతీయ రహదారులు ఉండడంతో.. ఇతర జిల్లాల నుంచి, రాష్ట్రాల వారు నేరుగా వచ్చి దొంగతనాలు చేసి పారిపోతున్నారనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.



నిర్మల్ మయూరి హోటల్ వద్ద జరిగిన చోరీలో సీసీ కెమెరాకు చిక్కిన వ్యక్తి ఫొటో (ఫైల్)

చోరీల నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలు..

- ఊరు విడిచి వెళ్లేటప్పుడు పోలీస్‌స్టేషన్‌లో సమాచారం ఇవ్వాలి. ఇంటి పక్క వారికి చెప్పి వెళ్లాలి. విలువైన వస్తువులను జాగ్రత్తగా భద్రపర్చుకోవాలి.
- ఇంట్లో, దుకాణంలో, కాలనీల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకుంటే మేలు.
- కాలనీలో అనుమానితులు కన్పిస్తే వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలి.

దొంగతనాల కట్టడికి చర్యలు



దొంగతనాల కట్టడికి చర్యలు తీసుకుంటున్నాం. బ్లూకోల్ట్ ,పెట్రోలింగ్ సిబ్బంది 24 గంటలు అందుబాటులో ఉంటారు. బ్యాంకులు, బస్టాండ్ రద్దీ ప్రాంతాల్లో మఫ్టీలో పోలీసు సిబ్బందిని ఉంచాం. అనుమానితులను అదుపులోకి తీసుకొని విచారిస్తున్నాం. మయూరి హోటల్ వద్ద రూ.5 లక్షలను ఎత్తుకెళ్లిన దొంగలను తమిళనాడు రాష్ట్రానికి చెందినవారిగా గుర్తించాం. విధిగా సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలి. ఇంటికి అలారం తాళం అమర్చాలి.

– ప్రవీణ్‌కుమార్, పట్టణ సీఐ

సీసీ రోడ్డు పనులు ప్రారంభం



పనులు ప్రారంభిస్తున్న కాంగ్రెస్ నాయకులు

బాసర: మండలకేంద్రంలోని ధోబిగల్లీలో ఉపాధి నిధులతో చేపట్టే సీసీ రోడ్ల నిర్మాణపనులను కాంగ్రెస్ మండలాధ్యక్షుడు మామ్మాయి రమేశ్ ప్రారంభించారు. మాజీ ఎమ్మెల్యే నారాయణరావు పటేల్, జిల్లా ఇన్‌చార్జి మంత్రి సీతక్క కృషితో మూడు నెలల్లో సుమారు రూ.50లక్షలతో సీసీ రోడ్లు, గ్రామంలో ఐదు బోర్లు వేయించినట్లు మండలాధ్యక్షుడు పేర్కొన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు రాజుదేశాయ్, సంజీవరావు దేశాయ్, బల్కం దేవేందర్, జలీల్ అహ్మద్, వార్డు మాజీ సభ్యుడు నానం సాయిలు, పలువురు కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

నూతన నియామకం



పత్రం అందుకుంటున్న దయానందరావు

బాసర: సోషల్ జస్టిస్ ఫర్ వరల్డ్ హ్యూమన్ రైట్స్ కౌన్సిల్ (ఎస్‌జెడబ్ల్యూహెచ్‌ఆర్‌సీ) బాసర మండల డైరెక్టర్‌గా ఉమ్మాయి దయానందరావు నియమితులయ్యారు. ఆదివారం హైదరాబాద్‌లోని ఓ హోటల్‌లో సభ్యత్వ నమోదు కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా ఎస్‌జెడబ్ల్యూహెచ్‌ఆర్‌సీ జాతీయ చైర్మన్ డాక్టర్ కొప్పుల విజయ్‌కుమార్ చేతుల మీదుగా దయానందరావు నియామక పత్రం అందుకున్నారు. కార్యక్రమంలో సోషల్ జస్టిస్ ఫర్ వరల్డ్ హ్యూమన్ రైట్స్ కౌన్సిల్ సౌత్ ఇండియా చైర్మన్ డాక్టర్ గంప హనుమాగౌడ్, నేషనల్ జనరల్ సెక్రెటరీ మామిడాల మనోహర్, ఉత్తర తెలంగాణ రాష్ట్ర చైర్మన్ డాక్టర్ సాప పండరి, ప్రతినిధులు పాల్గొన్నారు.

పీహెచ్‌సీలో నీటి కష్టాలు

- బోరు ఉన్నా.. కరువైన మోటార్
- ఏడాదిగా ఒంటికి, రెంటికి అవస్థలు
- ఇబ్బంది పడుతున్న రోగులు, సిబ్బంది



పీహెచ్‌సీ ఆవరణలో మోటారు పైపు



నీరు లేక నిరుపయోగంగా మరుగుదొడ్డి

లోకేశ్వరం: మండలకేంద్రంలోని పీహెచ్‌సీ(ప్రాథమిక ఆరోగ్య కేంద్రం)లో నీటి సౌకర్యం లేకపోవడంతో కనీస అవసరాలు తీర్చుకునేందుకు ఆసుపత్రి సిబ్బంది, రోగులు ఇబ్బంది పడుతున్నారు. బోరు బావికి ఉన్న మోటారును ఏడాది కిందట గుర్తుతెలియని వ్యక్తులు ఎత్తుకెళ్లారు. అప్పటినుంచి బోరుకు మోటారు బిగించలేదు. దీంతో బోరున్నప్పటికీ ఒంటికి, రెంటికి వెళ్లేందుకు ఇబ్బంది పడుతున్నారు. అధికారులు స్పందించి బోరుకు కొత్త మోటారును బిగించి.. నీటి సమస్య తీర్చాలని రోగులు కోరుతున్నారు.

మద్యం తాగి వాహనాలు నడుపొద్దు



బ్రీత్ ఎనలైజర్‌తో పరీక్ష చేస్తున్న ట్రెయినీ ఎస్సై జుబేర్

లక్ష్మణచాంద: మద్యం తాగి వాహనాలు నడుపవద్దని.. తాగి నడిపితేనే అధిక రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయని ట్రెయినీ ఎస్సై జుబేర్ తెలి పారు. ఆదివారం మండల కేంద్రంతోపాటు పలు గ్రామాల్లో వాహనదారులకు డ్రంకెన్ డ్రైవ్ పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వాహనదారులు తప్పనిసరిగా అన్ని ధ్రువపత్రాలు వెంట ఉంచుకోవాలని సూచించారు. కార్యక్రమంలో సిబ్బంది శ్రీనివాసరావు, గణేశ్ తదితరులు ఉన్నారు.

ఆధ్యాత్మిక చింతనతోనే ప్రశాంతత



శోభాయాత్రలో పాల్గొన్న వార్‌కరి భక్తులు

- మొగ్గిలో ముగిసిన పారాయణం

తానూరు: ఆధ్యాత్మిక చింతనతోనే మానసిక ప్రశాంతత సాధ్యమవుతుందని హరిభక్త పారాయణం కిశోర్ మహరాజ్ అన్నారు. ఆదివారం మండలంలోని మొగ్గి గ్రామంలో జ్ఞానేశ్వరి పారాయణం పల్లకి ఊరేగింపు కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. విఠలేశ్వర ఆలయం ప్రాంగణంలో ఆరు రోజులుగా కొనసాగుతున్న జ్ఞానేశ్వరి పారాయణం ఆదివారం ముగిసింది. ఈసందర్భంగా శోభాయాత్ర నిర్వహించగా మహిళలు మంగళహారతులతో తరలివచ్చారు. ఆయన మాట్లాడుతూ యువత చెడు వ్యసనాలకు దూరం ఉండాలని పేర్కొన్నారు. ఈసందర్భంగా భజన మండలిల ఆధ్వర్యంలో భజనలు చేశారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

నేడు సప్తాహం ముగింపు..

మొగ్గిలో వారం రోజులుగా కొనసాగుతున్న అఖండ హరినామ సప్తాహం సోమవారం ముగుస్తుందని సప్తాహం కమిటీ సభ్యులు తెలిపారు. ఉదయం కాళ్యకీర్తన అనంతరం భక్తులకు గ్రామకమిటీ ఆధ్వర్యంలో అన్నదానం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. వార్‌కరి భక్తులు తరలిరావాలని కోరారు.

కనకాపూర్‌లో వైద్యశిబిరం



రోగులను పరీక్షిస్తున్న డాక్టర్ విమలాకర్ రెడ్డి

లక్ష్మణచాంద: మండలంలోని కనకాపూర్ గ్రామంలోని కేఎస్‌ఆర్ గార్డెన్‌లో ఆదివారం విమలాకర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో జీవ క్యాన్సర్ శిబిరం ఏర్పాటు చేశారు. వడ్యాల్ గ్రామానికి చెందిన కిమ్స్ ఆసుపత్రి గ్యాస్ట్రో ఎంట్రాలాజిస్టు డాక్టర్ విమలాకర్‌రెడ్డి ఆధ్వర్యంలో 300 మందికి వైద్యపరీక్షలు నిర్వహించారు. ఈసందర్భంగా ప్రజలకు సీబీపీ, సీరమ్ క్రియాటిన్, లివర్ ఫంక్షన్ టెస్టు, ఎండోస్కోపీ అల్ట్రాసౌండ్, ఈసీజీ తదితర వైద్యపరీక్షలను ఉచితంగా చేశారు. అనంతరం అవసరమైన వారికి మందులు అందించారు. ప్రజలకు వైద్య పరీక్షల ఫలితాలు అందించి.. తీసుకోవాల్సిన ఆహారపు అలవాట్లపై అవగాహన కల్పించారు.

డీసీసీ అధ్యక్షుడి పరిశీలన

డాక్టర్ విమలాకర్ రెడ్డి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఉచిత వైద్య శిబిరాన్ని డీసీసీ అధ్యక్షుడు కూచాడి శ్రీహరిరావు, బీజేపీ నాయకులు సత్యనారాయణగౌడ్ పరిశీలించారు. వారు మాట్లాడుతూ మండల వాసులకు రూ. 4 లక్షల విలువైన వైద్యపరీక్షలను ఉచితంగా అందిస్తున్నందుకు విమలాకర్‌రెడ్డి, వైద్య బృందాన్ని అభినదించారు.

పారిశుద్ధ్య సిబ్బంది ఆరోగ్యాన్ని కాపాడుకోవాలి



సరుకులు అందిస్తున్న కార్యదర్శి రాజబాపు

కుంటాల: ఊరును శుభ్రంగా ఉంచే పారిశుధ్య సిబ్బంది తమ ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని పంచాయతీ కార్యదర్శి రాజబాపు పేర్కొన్నారు. ఆదివారం మండలకేంద్రంలోని పంచాయతీ కార్యాలయంలో 12 మంది పారిశుధ్య సిబ్బందికి సబ్బులు, చేతిగ్లౌజులు, నూనె, మాస్కులు పంపిణీ చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ పనులు చేసేటప్పుడు వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలని సూచించారు. కార్యక్రమంలో సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.